## క్లుప్తంగా

### ఇంటి పన్నుల వసూళ్లపై ఆరా!


గ్రామకంఠం మ్యాప్‌ను చూస్తున్న అధికారులు, సిబ్బంది

**బొండపల్లి:** మండలంలోని బొండపల్లిలో ఇంటి పన్నుల వసూళ్ల వివరాలను డీఎల్‌పీవో శిరీషారాణి ఆరా తీశారు. మంగళవారం ఆమె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇళ్ల పన్నులు తదితర అంశాలపై అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబటివలస గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని, గ్రామ కంఠం భూముల్లో ఇళ్లు నిర్మించి నివాసం ఉంటున్న వారి లబ్ధిదారుల వివరాలు సేకరించాలని పంచాయతీ కార్యదర్శి సత్యవతికి సూచించారు.

### ప్రకృతి వ్యవసాయం మేలు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఎల్

**బొండపల్లి:** ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతిలో పంటలను సాగు చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం ఆర్.టీ.ఎల్ హేమసుందర్ అన్నారు. మండలంలోని కొవ్వాడ పేటలో వీవీఏలకు నిర్వహిస్తున్న రెండవ రోజు శిక్షణను ఆయన మంగళవారం పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. రైతులు 365 రోజుల పాటు ఆదాయం పొందే విధంగా ఏ విధంగా పంటలను సాగు చేయాలో గ్రామంలోని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో మల్లికార్జునరావు, జేఆర్‌పీ మెర్సీ, రైతులు పాల్గొన్నారు.

### సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన


పొలం బడిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ

**వేపాడ:** ఖరీఫ్‌లో వరి సాగులో కలుపు నివారణ యాజమాన్య పద్ధతులపై కొత్తవలస వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు భానులత రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం జాకేరు, కరకవలస గ్రామాల్లో మండల వ్యవసాయాధికారిణి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెద వరి సాగులో కలుపు నివారణపై వివరించారు. ఈ పంట నమోదు అన్ని గ్రామాల్లో ప్రారంభమైందన్నారు. ప్రతీ ఒక్కరు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు, ఏఈవోలు పాల్గొన్నారు.

### యాదవ సంఘం సభ్యుల శ్రమదానం


శ్రమదానంతో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న యాదవ సంఘం సభ్యులు

**వేపాడ:** మండల కేంద్రమైన వేపాడలో గోపాల కృష్ణ యాదవ సంఘం సభ్యులు శ్రమదానంతో పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయ రహదారిలో చెత్తతో పాటు పిచ్చి మొక్కలను మంగళవారం తొలగించారు. ఈ నెల 16, 17 తేదీల్లో కృష్ణాలయం వార్షికోత్సవం, కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రమదానంలో భాగంగా రోడ్డుకిరువైపులా ఉన్న మొక్కలు తొలగించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల ఆందోళన


నిర్వాసితులతో కలిసి ఆందోళన చేస్తున్న జగన్ తదితరులు

**శృంగవరపుకోట:** కంపెనీ పేరుతో ఇప్పటి వరకూ రైతుల భూములు స్వాహా చేసిన జిందాల్ యాజమాన్యం ఇప్పుడు ఊళ్లకు ఊళ్లే స్వాహా చేసిందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గ్రామస్తులకు రైతులకు తెలియకుండా, దెప్పూరు, బందవలస గ్రామాలను జిందాల్ తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుందన్నారు. గ్రామసభలు, పంచాయతీ తీర్మానాలు లేకుండా నాడు జిందాల్ సేకరించిన భూముల్లో దెప్పూరు, బందవలసలను చూపించకుండా ఇప్పుడు ఎలా ఆక్రమిస్తున్నారని నిలదీశారు. నేటి వరకూ ఈ గ్రామాల పేర్లు జిందాల్ నిర్వాసిత గ్రామాల జాబితాలో లేవని ఇప్పుడు ఈ రెండు గ్రామాలను ఖాళీ చేయించేందుకు జిందాల్ సిద్ధమౌతోందని, దానికి జిల్లా అధికారులు వంత పాడుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు చేస్తున్న అనాలోచిత పనులకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని, నిర్వాసితుల సహనాన్ని అధికారులు పరీక్షిస్తున్నారన్నారు. నిర్వాసితులతో కలిసి బొడ్డవరలో ఆందోళన చేశారు.

# పాలకులకు ప్రయాణ కష్టాలు పట్టవా...!


రైవాడ కాలువపై శిథిలమైన కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక

- కుంగిన కల్వర్టు... పట్టని అధికారులు, పాలకులు
- ఆనందపురం నుంచి కేఆర్ పేటకు ఆటోలే శరణ్యం
- నెల రోజులుగా కేఆర్ పేట వరకే బస్సులు

**వేపాడ:** కొత్తవలస – దేవరాపల్లి ప్రధాన రహదారిలో కె.ఆర్.పేట జంక్షన్ వద్ద రైవాడ కాలువపై వేసిన కల్వర్టు కృంగిపోవటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దేవరాపల్లి బస్సులు కె.ఆర్.పేట వరకే నడుపుతుండడంతో అష్టకష్టాలు పడుతున్నారు. రోడ్లు భవనాల శాఖ– గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయ లోపంతో కల్వర్టు నిర్మాణానికి నోచుకోకపోవటంతో తమ పాలిట శాపంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. విశాఖ ఆర్‌టీసీ కాంప్లెక్సు నుంచి దేవరాపల్లికి ప్రతీ 15ని.కు ఒక సిటీ బస్సు తిరుగుతుండేది. ఈ బస్సులు విజయనగరం విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులకు అందుబాటులో ఉండేవి. అయితే గత మూడు నెలల క్రితం వేపాడ మండలం కృష్ణారాయుడుపేట జంక్షన్ వద్ద రైవాడ కాలువపై వున్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఏ సమయంలో కూలిపోతోందో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు దీంతో ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్టీసీ అధికారులు కల్వర్టుకు కంచె ఏర్పాటు చేసి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంతో 12డి, 68డి బస్సులను నెల రోజుల నుంచి కృష్ణారాయుడుపేట వరకు పరిమితంగా నడుపుతున్నారు. అయితే విశాఖ, విజయనగరం నుంచి వచ్చే ఉద్యోగులు వ్యాపారులు, ప్రయాణికులు కృష్ణారాయుడుపేట జంక్షన్‌లో దిగి ఆనందపురం వెళ్లాలంటే ఆటోకు 20, 30 రూపాయలు (సుమారు 2 కి.మీ) చెల్లించి ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. కల్వర్టుకు నిధులు మంజూరు చేయటంగానీ, నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారు. కె.ఆర్.పేటలో దిగిన ప్రయాణికులు దేవరాపల్లి, వేపాడ, వావిలపాడు, తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికి ఆటోలే శరణ్యం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు, గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ అధికారులు స్పందించి కల్వర్టుకు అవసరమైన నిధులు సమకూర్చి నిర్మాణం పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.


కృష్ణారాయుడుపేట జంక్షన్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

### త్వరగా కల్వర్టు నిర్మించండి


కె.ఆర్.పేట జంక్షన్ వద్ద రైవాడ కాలువపై కల్వర్టు త్వరితగతిని పూర్తి చేయాలి. ప్రయాణికులు ఇబ్బందులు తొలగించాలి. దేవరాపల్లి బస్సులు కె.ఆర్.పేట జంక్షన్ వద్ద నిలిపేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. – కర్రి లీలావతి, కె.ఆర్.పేట

### నెల రోజులుగా అవస్థలు


గత నెల రోజులుగా దేవరాపల్లి బస్సులు కె.ఆర్.పేట జంక్షన్‌లో నిలుపు చేయటంవల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలో ప్రయాణిస్తే అధిక మొత్తలు వసూలు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు లగేజీలతో అవస్థలు పడుతున్నారు. కల్వర్టు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. – బి.మణి, ఎ.కె.జి.పాలెం

### ఇబ్బందులు పడుతున్నాం..


కె.ఆర్.పేట జంక్షన్‌లో దిగి వేపాడ రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆనందపురం వరకు ఆటో ఎక్కి అక్కడ నుంచి వేపాడ రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా కల్వర్టు నిర్మించాలి. – వాకాడ సత్యవతి, గృహిణి, వేపాడ

# ఇంటింటికీ చంద్రబాబు మోసాలు

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** గరివిడి మండలంలోని శేరీపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికీ ఏ పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛన్ అందిస్తామని చెప్పి అధికారంలోనికి వచ్చిన తరువాత కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము కృష్ణ, పిల్ల రామయ్యమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, పలు పంచాయతీల సర్పంచు, ఎంపీటీసీలు జి.తమ్మినాయుడు, యల్లంటి పోలీస్ నాయుడు, బమ్మిడి కార్తీక్, ముద్దాడ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు

### మోసం చేయడమే బాబు విజనరీ


చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**గుర్ల:** ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు విజనరీ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు , జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ధ్వజమెత్తారు. మండలంలోని ఆనందపురంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తుండేవని, కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు కూటమి నేతల ఇంటి వద్దకే వెళ్లాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు , జమ్ము స్వామినాయుడు , కెంగువ మధుసూధనరావు , బోళ్ల సుబ్రమణ్యం, తోట తిరుపతిరావు, మీసాల చిన్నప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### క్యాంపస్ సెలక్షన్స్

**శృంగవరపుకోట:** పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. పూణేకు చెందిన హానర్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. తొలి రౌండ్‌లో 60 మంది ఎంపిక కాగా వీరికి ఫైనల్‌గా టెలిఫోనిక్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని కంపెనీ హెచ్‌ఆర్ తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కర్, పీవో మధు తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో డీడీవో పర్యటన


సాతాంవలస సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న చీపురుపల్లి డీడీవో

**మెరకముడిదాం:** చీపురుపల్లి డివిజన్ డవలెప్‌మెంట్ అధికారి కె.హేమసుందరరావు మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా ముందుగా యాడిక గ్రామంలో ఉదయం 7.30 గంటలకు పారిశుద్ధ్య పనుల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులకు, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గరుగుబిల్లిలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న గ్రామకంఠం భూములు సర్వేను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాతాంవలస సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు, అలాగే భీమవరం పంచాయతీకి సంబంధించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదును పరిశీలించడంతో గ్రామానికి సంబంధించి 99.65 శాతం పన్నులు నమోదు చేయడంపై పంచాయతీ కార్యదర్శి జామి మురళీకృష్ణను అభినందించారు. మెరకముడిదాం వెలుగు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన తిరంగా మాల్‌ను పరిశీలించిన అనంతరం భైరీపురం పాఠశాలలో విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటూ ఎంపీడీవో గొర్లె భాస్కరరావు, తహసీల్దారు సుశీలా రాణి, డిప్యూటీ ఎంపీడీవో రామునాయుడు, ఉపాధి హామీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మరో పైప్‌లైన్‌కు భూములివ్వం..!


తమ ఆవేదన అధికారులకు వివరిస్తున్న రైతులు

**కొత్తవలస:** ఇప్పటికే విలువైన పంట భూములను ఐఓసీఎల్ పైప్‌లైన్, హైపవర్ విద్యుత్ లైన్, గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్వేలైన్ తదితర ప్రాజెక్టుల కోసం లాక్కున్నారని పరిహారం మాత్రం తూతూ మంత్రంగా అందించారని మరో ప్రాజెక్టుకు భూములను ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు హిందుస్థాన్ పెట్రోల్ కార్పొరేషన్‌కు చెందిన పైప్ లైన్ నిర్మాణానికి సంబంధించి గులివిందాడ, దెందేరు, సంతపాలెం, ముసిరాం, దేవాడ తదితర గ్రామాల రైతులతో మండల కేంద్రంలో గల ఎంపీడీఓ కార్యాలయంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుధాసాగర్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విలువైన పంట భూముల్లో అడ్డుగా పైప్‌లైన్ వేస్తే భవిష్యత్ అవసరాలకు భూములను అమ్ముకోవాల్సి వస్తే కొనేందుకు ఎవరూ ముందుకు రారని వాపోయారు.పైప్‌లైన్ నిర్మాణానికి సేకరించిన భూమికి మార్కెట్ విలువలో కేవలం 10 శాతం మాత్రమే పరిహారం చెల్లించడం ఎంతవరకు సంజసమని ప్రశ్నించారు. పైప్‌లైన్ నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెగేసి చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిప్యూటీ మేనేజర్ ఎం.లక్ష్మణ్, విశ్రాంత తహసీల్దార్ జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగులతో పోషకాహార లోపం : డీఎంహెచ్‌వో

**గంట్యాడ:** కడుపులో నులి పురుగులు నివారించుకోకపోతే పోషకాహార లోపం వచ్చే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి అన్నారు. మండలంలోని పెదమజ్జిపాలేం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ప్రతీ ఏటా అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులు వేసుకోవాలన్నారు. 19 ఏళ్లలోపు పిల్లలు ఈ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడ శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి అల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

## సంక్షిప్తంగా...

**భీమసింగి సుగర్ కార్మికుల పీఎఫ్ చెల్లించాలి**

**జామి:** భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడ్డాయని, కూటమి ప్రభుత్వం వెంటనే కార్మికులు, ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టిబాబ్జీ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందించినట్లు తెలిపారు. జామిలో విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపడం లేదన్నారు. సుగర్స్ సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

**కేన్సర్ వ్యాధిపై అవగాహన**

**జామి:** మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బాలమురళి సహకారంతో మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి వారిచే గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సులో ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్ టి.ఉమాశంకర్ తదితరులు మాట్లాడుతూ కేన్సర్‌ను తొలి దశలోనే ఎలా గుర్తించాలన్నది వివరించారు. ఏరియా బ్రాంచ్ మేనేజర్ వీరబాబు పాల్గొన్నారు.

**వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రణాళికలు**

**గజపతినగరం:** వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు నష్టపోకుండా వారికి సాగునీరు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను కల్పించేలా చూడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో వివరాలు తెలుసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారితో పాటు ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రైమరీ సెక్టార్ అధికారులు, సీపీఏపీ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**యువతి అదృశ్యంపై కేసు నమోదు**

**కొత్తవలస:** మండలంలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతి ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్టు సీఐ షణ్ముఖరావు మంగళవారం తెలిపారు. యువతి లంకెలపాలెం సమీపంలో గల ఒక ఫార్మా కంపెనీలో పని చేస్తోందని ఇటీవల ఆమెకు వివాహం నిశ్చయమైందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ నెల 10వ తేదీ ఉదయం పెళ్లి నిమిత్తం పసుపు దంపుడు కార్యక్రమాన్ని నిర్వహించామని ఆ సమయంలో కూడా తన కుమార్తె అందరితో సరదాగా గడిపిందని పేర్కొన్నారు. కాగా అదే రోజు ఇంటిలో అందరూ నిద్రస్తుండగా అర్ధరాత్రి సమయంలో లేచి చూసేసరికి తన కుమార్తె కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

# బాబు చెప్పేవన్నీ అబద్ధాలే...


పూతికవలసలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**మెరకముడిదాం:** చంద్రబాబునాయుడు చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఆయన మాటలను నమ్మి ఎన్నికల్లో ఓట్లు వేసి ప్రజలు మోసపోయారని వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డివేణుగోపాల్‌రావు, బూర్లె నరేష్‌కుమార్ అన్నారు. పూతికవలస గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఇంటింటికి వెళ్లిఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను, ఎన్నికలు అయిపోయిన తరువాత కూటమి ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో తాడ్డి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ చంద్రబాబు చేతిలో మళ్లీ మోసపోకుండా వుండాలంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఉచిత బస్సును ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఆ పథకానికి సవాలక్ష ఆంక్షలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తల్లికి వందనం కొందరికే ఇచ్చారని, అన్నదాత సుఖీభవ పథకం కొందరు రైతులకు మాత్రమే ఇచ్చారని ఇలా ప్రతీ పథకంలో కోతలు పెడుతున్నారన్నారు. స్థానిక సర్పంచ్ మజ్జి అన్నపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, మోహన్, పి.శ్రీనివాసరాజు, సిహెచ్.చిరంజీవిరావు, బొత్స మోహన్‌రావు, కనకరాజు, శివాజీరాజు, పెద బాబు తదితరులు పాల్గొన్నారు.

# బాబును నమ్మి మళ్లీ మోసపోవద్దు...

**శృంగవరపుకోట:** ఎన్నికల వేళ ఇచ్చిన మేనిఫెస్టోను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని, మరోమారు జనాన్ని మోసం చేసి, చంద్రబాబు ప్రజల్ని ఏమారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం పట్టణంలో బర్మాకాలనీ, పుణ్యగిరి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్ నేతృత్వంలో బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో పాటూ పలువురు నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి మోసాలను వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, వాకాడ రాంబాబు, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, పాలమరశెట్టి రామకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎమ్పీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్.కోటలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

## ఆటో డ్రైవర్ల నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసలో పాల్గొన్న ఆటో యూనియన్ కార్మికులు

**గజపతినగరం:** ఆటో డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి తరువాత ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లేనిపోని జీవోలను తీసుకువచ్చి అపరాధ రుసుంలు వేసి తమను రోడ్డును పడేస్తున్నారని అన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించి థర్డ్ పార్టీ ఇన్సురెన్స్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా మోటారు, ఆటో వాహనాల ఫిట్‌నెస్, ఎఫ్‌సీలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ శోభారాణికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గజపతినగరం నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు, ఆర్.రాము, డి.సూర్యారావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మోసకారి చంద్రబాబు


బానాదిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

**వేపాడ:** మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించిందని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. బానాది గ్రామంలో ఎంపీపీ సత్యవంతుడు, మండల పార్టీ అధ్యక్షుడు జగ్గుబాబు నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసపూరిట హామీలను వివరించారు. సూపర్ సిక్స్ అందరికీ అమలు కావడం లేదన్నారు. ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, సర్పంచ్ కర్రి యశోద, మండల, గ్రామ నాయకులు బోజంకి శ్రీను, రంధి శ్రీరాములునాయుడు, వేమననాయుడు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తిరంగా మేళాపై అవగాహన అవసరం

**గజపతినగరం:** తిరంగ మేళా కార్యక్రమంపై ప్రతీ ఒక్క మహిళ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన తిరంగా మేళా ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తిరంగ మేళాలో భాగంగా మహిళలు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమాలైన వివిధ రకాల ఉత్పత్తులు కూరగాయలు, బట్టలు, తినుబండారాలను ప్రదర్శించడం జరిగిందని వాటిని ప్రతీ ఒక్కరు తిలకించాలని సూచించారు.

**గంట్యాడ:** ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఎంతోమంది త్యాగధనుల తమ ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ విజయ్‌కుమార్, పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తవలస /లక్కవరపుకోట:** భారత స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల్లో మహిళలతో త్రివర్ణ జెండాను చేతబట్టి ర్యాలీలను నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రీయ పద్ధతిలో పండించిన కాయగూరలతో జాతీయ జెండాను రూపొందించారు. ఈ చిత్రం పలువురుని విశేషంగా ఆకట్టుకొంది.

## ఎన్‌ఎంయూ కార్మికుల ధర్నా

**శృంగవరపుకోట:** రాష్ట్ర కౌన్సిల్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్.కోట ఆర్టీసీ డిపోలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ లూలూ కంపెనీకి గవర్నర్‌పేట–2 డిపోకు స్థలం కేటాయించటాన్ని వ్యతిరేకించారు. ఇందుకు నిరసనగా 12, 13 తేదీల్లో డిపోల్లో ధర్నాలు చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎ.రాజయ్య, అధ్యక్షులు జి.వి.రమణ, రీజియన్ కమిటీ సభ్యులు కె.ఆనంద్, జోనల్ వైస్ ప్రెసిడెంట్ జి.ఎస్.రాజు, రీజనల్ చైర్మన్ సి.హెచ్.ఎస్.వి.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.